క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 సాయి ఐశ్వర్య ఫీడర్ పరిధిలోని సాయి ఐశ్వర్య కాలనీ, జైన్ హౌసింగ్, ఖాజాగూడ విలేజ్, హెచ్ఎండీఏ బిల్డింగ్, గ్రీన్ గ్రేస్ అపార్ట్‌మెంట్స్, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ప్రశాంతి హిల్స్ ఫీడర్ పరిధిలో మధురానగర్, రాయదుర్గం పోలీస్ స్టేషన్, బయోడైవర్సిటీ పార్క్, ప్రశాంతిహిల్స్, సైబరాబాద్ కమిషనరేట్, కేర్ హాస్పిటల్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఐఐఆర్ఎం ఫీడర్ పరిధిలో ఐఐఆర్ఎం, విప్రో సర్కిల్, ఎన్ వీడియా, వరుణ్ మోటార్స్, కార్వీ, ఆంధ్ర బ్యాంక్,జయభేరీ ఆరంజ్ కౌంటీ, మంత్రి అపార్ట్‌మెంట్స్, ట్రిండ్‌సెట్ అపార్ట్‌మెంట్స్, ఫీనిక్స్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో... టమాట (3 కేజీలు) 100, పచ్చిమిర్చి 50 , బెండ 40, కాకర 50, దొండ 40, దోస 60, ఆలు 25, చామ 50, కీర 25, బీర 40, వంకాయ 40, గోకర 50, బీన్స్ 70, బీట్‌రూట్ 50, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 30, క్యారెట్ 55, చిక్కుడు 60, ఉల్లి 30 (1 కేజీ), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 30, అల్లం 180, వెల్లుల్లి 180

మహిళను కాపాడిన ఐటీ పోలీసులు

మాదాపూర్: కుటుంబ కలహాల వల్ల ఆత్మహత్యకు పాల్పడుతున్న మహిళను ఐటీ పెట్రోలింగ్ పోలీసులు కాపాడారు. జీడిమెట్ల చింతల్‌కి చెందిన భాగ్యలక్ష్మి (29) కుటుంబకలహాల వల్ల శుక్రవారం మాదాపూర్‌లోని కేబుల్‌బ్రిడ్జిపై నుంచి దూకడానికి ప్రయత్నిస్తుండగా అటువైపుగా వస్తున్న ఐటీ పోలీసులు వెంటనే గమనించి పట్టుకున్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో కౌన్సిలింగ్ ఇచ్చి తన భర్త సిద్దుకి అప్పగించారు.

ఆశవర్కర్లను పర్మనెంట్ చేయాలి

పటాన్‌చెరు టౌన్: 18 ఏళ్లుగా గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు సేవలు అందిస్తున్న ఆశవర్కర్లను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు తహశీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశవర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆశావర్కర్లకు ఫిక్స్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం పారితోషకం రూపంలో ఆశలకు రూ.9750 మాత్రమే ఇస్తున్నారన్నారు. అదే విధంగా ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రభుత్వం స్పందించి ఆశవర్కర్లను రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో గీతా, హైమావతి, లక్ష్మి, లావణ్య పాల్గొన్నారు.

పాఠశాలల్లో కరాటే శిక్షణ ఇవ్వాలి



విజేతలకు ట్రోఫీలను అందజేస్తున్న సినీహీరో సుమన్

మణికొండ: ఆత్మరక్షణ, ఆరోగ్యానికి కరాటే ఎంతగానో ఉపయోగపడుతుందని, రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రతి పాఠశాలలో వారంలో రెండ్రోజులు కరాటేలో శిక్షణ ఇవ్వాలని సినీనటుడు సుమన్ అన్నారు. జాతీయ ఓపెన్ కరాటే కుంగ్‌ఫు చాంపియన్ షిప్- 2024, సుమన్ శోటోకాన్‌కరాటే అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నగరంలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో రెండ్రోజులుగా పోటీలను నిర్వహించారు. విజేతలకు మణికొండ కేఎస్ గుప్తా గ్రూప్ ఆఫ్ హోటల్స్‌లో శుక్రవారం బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కరాటే నేర్చుకోవటం ద్వారా ముఖ్యంగా బాలికలు ఆత్మవిశ్వాసంతో ఉండొచ్చన్నారు. రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి పాఠశాలల్లో కరాటే శిక్షణ గురించి ఆలోచించాలని సూచించారు.

27న పెరిక కులస్తుల భవనానికి శంకుస్థాపన

మణికొండ: కోకాపేటలో పెరిక కులానికి కేటాయించిన రెండెకరాల భూమిలో నిర్మించే ఆత్మగౌరవ భవనానికి ఆదివారం ఉదయం 7గంటలకు శంకుస్థాపన, మధ్యాహ్నం 12 గంటలకు బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు గటిక విజయ్‌కుమార్ తెలిపారు. సభాధ్యక్షుడిగా కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్, ముఖ్య అతిథిగా రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్, గౌరవ అతిథులుగా మంత్రులు టి. హరీష్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్, వి. శ్రీనివాస్‌గౌడ్‌లు పాల్గొంటారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పెరిక కులస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.



జీపీఆర్ఏ క్వార్టర్స్ ఆలయంలో..



నానక్‌రాంగూడలో..



గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో..



వైభవంగా 'వరలక్ష్మీవ్రతం' పూజలు

- ఆలయాల్లో సామూహిక కుంకుమార్చనలు
- అమ్మవార్లకు ఉదయం నుంచీ ప్రత్యేక పూజలు
- ఆలయాల్లోని పూజలకు పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు



జీపీఆర్ఏ క్వార్టర్స్‌లో..

రాయదుర్గం: శ్రావణమాస వరలక్ష్మీవ్రతం కార్యక్రమాలతో ఆలయాలన్నీ కిటకిటలాడాయి. పలు ఆలయాల్లో సామూహిక కుంకుమార్చనలు ఘనంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని నిర్వహించారు. ఉదయం నుంచీ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు అనంతరం ప్రత్యేక అలంకారం చేశాక భక్తులకు దర్శనం కల్పించారు. ముఖ్యంగా జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. రకరకాల చీరలతో అమ్మవారికి అలంకారం చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అర్చకుల సమక్షంలో మహిళా భక్తులచే కుంకుమార్చనలను వైభవంగా నిర్వహించారు.

- గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో అన్నపూర్ణాదేవి అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకారం చేశాక భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.
- నానక్‌రాంగూడలోని భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో కూడా అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం రాయదుర్గం, మధురానగర్, ఖాజాగూడ, సాయిఐశ్వర్యకాలనీ, సాయివైభవ్‌కాలనీ, నానక్‌రాంగూడ, గౌలిదొడ్డి, గోపన్‌పల్లి, గోపన్‌పల్లితాండ, టెలికామ్‌నగర్ కాలనీల్లోని అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు.

ప్రమాదాలను తగ్గించేందుకు పెలికాన్ సిగ్నల్స్

- సైబరాబాద్ కమిషనరేట్‌లో 44 పెలికాన్ సిగ్నల్స్
- సత్ఫలితాలిస్తే మరికొన్ని చోట్ల ఏర్పాటు
- సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర



పెలికాన్ సిగ్నల్‌ను ప్రారంభిస్తున్న సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తదితరులు

గచ్చిబౌలి: పాదాచారుల ప్రమాదాలను తగ్గించేందుకు 'పెలికాన్ సిగ్నల్స్' ఏర్పాటు చేశామని సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర పేర్కొన్నారు. శుక్రవారం మాదాపూర్ జోన్‌లో గూగుల్ ఆఫీస్ ముందు సేఫ్ సిటీ ప్రాజెక్టులో భాగంగా ఏర్పాటు చేసిన పెలికాన్ సిగ్నల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రోడ్డు దాటుతున్న పాదాచారులు ప్రమాదాల బారిన పడి తీవ్ర గాయాలు కావడం, ప్రాణాలు కోల్పోవడం జరుగుతుందన్నారు. ప్రమాదాల సంఖ్యను తగ్గించాలనే లక్ష్యంతో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 44 చోట్ల పెలికాన్ సిగ్నల్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి సిగ్నల్ వద్ద ఇద్దరు వార్డెన్‌లు విధులు నిర్వహిస్తారని, 88 మంది వార్డెన్స్‌కు టీటీఐలో వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చామని వివరించారు. ప్రస్తుతం ఏర్పాటు చేసిన సిగ్నల్స్ సత్ఫలితాలు ఇస్తే మరిన్ని పెలికాన్ సిగ్నల్స్ ఏర్పాటు చేస్తామని ఆయన ప్రకటించారు. పాదాచారులు భద్రత కోసం సేఫ్ సిటీ ప్రాజెక్టులో పెలికాన్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ హర్షవర్ధన్ మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి 11.30 గంటల వరకు, సాయంత్రం 4.30 గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు వార్డర్స్ పెలికాన్ సిగ్నల్స్‌ను ఆపరేట్ చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ హర్షవర్ధన్, మాదాపూర్ డీసీపీ సందీప్ రావు, మాదాపూర్ ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాస్ రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ రణవీర్ రెడ్డి, సీఐ నర్సయ్య, ఎస్‌సీఎస్‌సీ ట్రాఫిక్ ఫోరం జాయింట్ సెక్రెటరీ శ్రీనివాస్, సేఫ్ సిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల ఆందోళన



చందానగర్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో ధర్నా చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

హఫీజ్‌పేట్ : జీహెచ్ఎంసీలోని పారిశుధ్య కార్మికులను పర్మినెంట్‌తో పాటు జీతాలు పెంచాలని చందానగర్ సర్కిల్ 21 కార్యాలయం ముందు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు మాట్లాడుతూ తమకు ఉద్యోగ భద్రత కల్పించి, హామీలను నెరవేర్చాలన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక కాంట్రాక్ట్ పద్ధతే ఉండదని చెప్పారు, కానీ సీఎం కెసిఆర్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. తమకు జీతాలు సరిపోవడం లేదని, ఆరోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. వెంటనే జీహెచ్ఎంసీ పరిధిలో పని చేసే పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేసి జీతాలు పెంచాలన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకులు కసిరెడ్డి బాస్కర్‌రెడ్డి, మొవ్వ సత్యనారాయణ, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మారబోయిన రఘునాథ్ యాదవ్, జెరిపాటి జైపాల్ మద్దతు తెలిపారు.





ఆర్ట్‌గ్యాలరీలో చిత్రప్రదర్శన ప్రారంభం

కళాకారుడు వేసిన చిత్రాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. మాదాపూ ర్‌లోని చిత్రమయిస్టేట్‌ఆర్ట్‌గ్యాలరీలో శుక్రవా రం ఎర్పాటు చేసిన పెయింటింగ్, డ్రాయింగ్ ఎగ్జిబిషన్‌ను ఆర్ట్‌గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్. కె.లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాకారుడు ఎ.శ్రీకాంత్‌బాబు వేసిన చిత్రాలు సందేశాత్మకగా ఉన్నాయని కొనియాడారు. 60కిపైగా చిత్రాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. -మాదాపూర్

ముంపు సమస్య పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటాం

శేరిలింగంపల్లి: వర్షాకాలంలో ముంపు సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటున్నా మని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ పేర్కొన్నారు. శేరిలింగంపల్లి డివిజన్ లోని తారానగర్‌లోని నాలా నుంచి మసీదు వరకు రూ.2 కోట్ల వ్యయంతో చేపట్టిన బాక్స్ డ్రెయిన్ నిర్మాణ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాక్స్ డ్రెయిన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జీహెచ్ఎంసీ ఏఈ సునీల్, నాయకులు వీరేశంగౌడ్, రాగం అనిరుధ్‌యాదవ్, రాంచందర్, గడ్డం రవి యాదవ్ పాల్గొన్నారు.

బీసీ బంధును సద్వినియోగం చేసుకోవాలి

జిన్నారం(పటాన్‌చెరు): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన బీసీ బంధు పథకాన్ని లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని గుమ్మడిదల ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో బీసీబంధు లబ్దిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందజేసే బీసీ బంధు డబ్బుల ద్వారా స్వయం ఉపాధిని పొందుతూ ఆర్థికంగా ఎదగాలన్నారు. ఇందుకు సంబంధించి ఎలాంటి సహకారం కావాలన్నా తమ ను సంప్రదించాలని సూచించారు. సిబ్బంది సుభాష్ పాల్గొన్నారు.

ఉన్నతంగా ఆలోచించండి

- ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు స్కై రూట్ సీఈవో పవన్ ఉద్బోధ

పటాన్‌చెరు టౌన్: ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఎల్లవేళలా ఉన్నతంగా ఆలోచించాలని, అత్యధిక ప్రభావం చూపే సమస్యలను పరిష్కరించి సమాజం మెప్పు పొందినప్పుడు ప్రపంచ మద్దతు లభిస్తుందని స్కై రూట్ ఏరోస్పేస్ సహ వ్యవస్థాపకుడు, ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో) పవన్ చందన అన్నారు. పటాన్‌చెరులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో గీతం స్మార్ట్ ఐడియా థాన్-2023 మూడో విడత పోటీల (అత్యుత్తమ ఆవిష్కరణలు చేసిన విద్యార్థులను ప్రోత్సహించే కార్యక్రమం) ముగింపు ఉత్సవంలో ఆయన మాట్లాడారు. గతంలో స్టార్టప్లను ప్రజలు అంతగా విశ్వసించే వారు కాదని, కానీ కొన్ని విజయవంత గాథలు వింటున్న ఈ తరుణంలో వాటిపై సానుకూలత పెరిగిందన్నారు. రెండేళ్ల క్రితమే అంతరిక్ష రంగంలో పోటీపడటానికి అందరికీ కేంద్ర ప్రభుత్వం అనుమతించిందని, వచ్చే పదేళ్లలో ఆ రంగానికి మంచి భవిష్యత్ ఉంటుందని పవన్ ఆశాభావం వ్యక్తం చేశారు. గీతం స్మార్ట్ ఐడియా థాన్ విజేతను ఆయన అభినందించారు. గీతం అధ్యక్షుడు శ్రీభరత్ మాట్లాడుతూ.. స్కై రూట్ ఆరేళ్లలో దాదాపు 500 కోట్ల రూపాయల నిధులను సమీకరించగలిగిందని చెప్పారు. అమెరికాలోని బోస్టన్‌లో ఉన్న నార్త్ ఈస్టర్న్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ గ్రెగ్ కొలియర్, ప్రొఫెసర్ రవి రామ్మూర్తి స్టార్ట్ ఐడియా థాన్-2023 ఫలితాలను వెల్లడించి, విజేతలను సత్కరించి నగదు పురస్కారాన్ని అందజేశారు.

నేడు ఎంజీఐటీలో అలుమ్ని మీట్

మణికొండ: ఎంజీఐటీ కళాశాలలో శనివారం సాయంత్రం పూర్వ విద్యార్థుల సమ్మేళనం (అలుమ్ని మీట్) నిర్వహిస్తున్నట్లు యాజమాన్యం ప్రకటించింది. వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులతో పాటు కళాశాల చైర్మెన్ డి. ప్రవీణ్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొంటారని పేర్కొన్నారు.

'మనూ'లో సివిల్ సర్వీసెస్ పరీక్షలకు ఉచిత కోచింగ్

- దరఖాస్తులకు చివరి తేదీ సెప్టెంబర్ 4
- సెప్టెంబర్ 17న ప్రవేశ పరీక్ష: వెల్లడించిన ఇన్‌చార్జి డైరెక్టర్ అలీమ్‌భాషా

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో సివిల్ సర్వీసెస్ పరీక్షలకు ఉచితంగా కోచింగ్ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేసినట్లు సీఎస్ఈ-ఆర్‌సీఏ ఇన్‌చార్జి డైరెక్టర్ ప్రొఫెసర్ హెచ్ అలీమ్ భాషా శుక్రవారం తెలిపారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలోని సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ రెసిడెన్షియల్ కోచింగ్ అకాడమీ(సీఎస్ఈ-ఆర్‌సీఏ) ద్వారా సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలు-2024 కోసం హాస్టల్ సౌకర్యంతో కూడిన ఉచిత కోచింగ్ అందిస్తుందన్నారు.. అందుకోసం దరఖాస్తులను అర్హులైన వారి నుంచి సమర్పించడానికి చివరి తేదీ సెప్టెంబర్ 4గా నిర్ణయించామన్నారు. మైనార్టీలు, ఎస్సీ, ఎస్టీ, మహిళలలో ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. ప్రవేశ పరీక్షను సెప్టెంబర్ 17న నిర్వహించేందుకు కూడా ఏర్పాట్లు చేశామన్నారు. ఈ పరీక్షలలో ఎంపికైన వారికి కోచింగ్ తరగతులను అక్టోబర్ 16వ తేదీ నుంచి ప్రారంభించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు యూనివర్శిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. వివరాలకు 6303582771, 9441428108, 8374627871 నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

స్పెషల్ క్యాంపెయిన్ డేపై బీఎల్‌ఓలకు అవగాహన



బీఎల్‌ఓలకు కిట్లను అందజేస్తున్న నియోజకవర్గ ఈఆర్‌ఓ రజనీకాంత్‌రెడ్డి తదితరులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో బూత్ లెవల్ ఆఫీసర్ల (బీఎల్‌ఓ)లకు స్పెషల్ క్యాంపెయిన్ డే పై అవగాహన కల్పించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ ఈఆర్‌ఓ, డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 26, 27 తేదీల్లో, వచ్చే నెల 2,3 తేదీల్లో పోలింగ్ కేంద్రాల భవనాల్లో బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారన్నారు. కొత్తగా ఓటరు జాబితాల్లో నమోదు కోసం ఫారం-6, తప్పుల సవరణలు, నియోజకవర్గ పరిధిలో చిరునామా మార్పు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. బీఎల్‌ఓల వద్ద డ్రాఫ్ట్ రోల్ అందుబాటులో ఉంటుందని, జాబితాలో పేరు, వివరాలను ఓటర్లు పరిశీలించుకోవాలని కోరారు. బీఎల్‌ఓలకు కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ నరేందర్‌రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ మణిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ స్థాయిలో రాణించిన గురుకుల గోల్ఫ్ క్రీడాకారులు



గౌలిదొడ్డిలోని సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాలలో గోల్ఫ్ క్రీడలో పతకాలను సాధించిన విద్యార్థులను సన్మానించిన ప్రిన్సిపాల్ పాపారావు

రాయదుర్గం: సౌత్‌జోన్ స్థాయి గోల్ఫ్ చాంపియన్‌షిప్ పోటీలలో సాంఘీక సంక్షేమ గురుకుల విద్యార్థులు తమ సత్తాను మరోసారి చాటారు. గౌలిదొడ్డిలోని సాంఘీక సంక్షేమగ ఉరుకుల విద్యార్థులు గోల్ఫ్ క్రీడల్లో రాణిస్తూ పతకాలు సాధించడం విశేషం. ఈ సందర్భంగా శుక్రవారం గౌలిదొడ్డిలోని సాంఘీక సంక్షేమ గురుకుల బాలుర జూనియర్ కళాశాల, మెడికల్, నీట్ కోచింగ్ అకాడమీలో ప్రతిభ చాటిన విద్యార్థులను సన్మానించి సర్టిఫికెట్లు, పతకాలను అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ పాపారావు గోల్ఫ్ క్రీడల్లో రాణించి పతకాలు సాధించిన విద్యార్థులు, కోచ్, ఫిజికల్ డైరెక్టర్‌ను పూలమాలలతో సత్కరించారు. అనంతరం పాపారావు మాట్లాడుతూ చదువులోనే కాకుండా క్రీడలలో కూడా విద్యార్థులు రాణించేలా వారికి నచ్చిన క్రీడలో తర్ఫీదు ఇప్పించడం జరుగుతోందన్నారు. గోల్ఫ్ క్రీడ అనేది ఖరీదైన క్రీడ అనే వారికి సాంఘీక సంక్షేమ కళాశాలలో చదివే పేద విద్యార్థులకు చదువు, ఉన్నత చదువులకోసం శిక్షణ ఇవ్వడమే కాకుండా ఖరీదైన గోల్ఫ్ క్రీడలోనూ శిక్షణ ఇవ్వడంతో సౌత్‌జోన్ స్థాయిలో పతకాలను విద్యార్థులు సాధించడం గర్వంగా ఉందన్నారు. ఈ గోల్ఫ్ క్రీడలలో అమూల్య, అనూషలకు స్వర్ణపతకం, మధుకు రజతం, అఖిల, ముకుల్, జెరుసలకు కాంస్య పతకాలు పొందారు. వారిని గురుకులాల ఆర్‌సీఓ డాక్టర్ శారదవెంకటేష్ అభినందించారు. క్రీడలలో రాణించేవారికి సరైన శిక్షణ ఇచ్చేలా చూడాలని ప్రిన్సిపల్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో గురుకులాల స్పోర్ట్స్ ఆఫీసర్ రామ్‌లక్ష్మణ్, వ్యాయామ ఉపాధ్యాయులు కె సత్యనారాయణ, క్రీడాకారులు, పలువురు విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా కాంగ్రెస్ పార్టీ



పారిశుద్ధ్య కార్మికులకు మద్దతు తెలుపుతున్న మాజీ కార్పొరేటర్ గొట్టిముక్కల వెంగళరావు


కూకట్‌పల్లి: మూసాపేట జీహెచ్ఎంసీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు టీపీసీసీ సభ్యుడు గొట్టిముక్కల వెంగళరావు శుక్రవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వటట్లాడుతూ.. కార్మికుల నిరసన చేసిన రోజులు భోజనాల ఖర్చు భరిస్తానని హామీ ఇచ్చారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వస్తే మన బతుకులు మారుతాయి అనుకున్నామని కానీ కేవలం కేసీఆర్ కుటుంబ మాత్రమే బాగు పడిందని ఆవేదన వ్యక్తం వ్యక్తం చేశారు. కరోనా కష్టకాలంలో జీహెచ్ఎంసీ కార్మికుల కృషి అనిర్వచనీయమైనదని గుర్తుచేశారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ నెరవేర్చాలన్నారు. జీతాలు పెంచి, ఉద్యోగాలను పర్మనెంట్ చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. విషయాన్ని పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేటట్లు కాంగ్రెస్ పార్టీ తరపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు బషీర్, గోపిశెట్టి రాఘవేందర్, సతీష్ గౌడ్, రమేష్, సుధాకర్‌రెడ్డి, ప్రసన్న కుమార్, కృష్ణవేణి, అరుణ్, గురుమూర్తి, గణేష్, ఎన్ఎస్‌యూఐ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఓటు నమోదు చేసుకోండి

మణికొండ: గండిపేట మండల పరిధిలోని అన్ని పోలింగ్‌బూత్‌లలో శని, ఆదివారాల్లో కొత్త ఓటర్ల నమోదు, తప్పులను సరిచేసుకునే అవకాశాన్ని రాష్ట్ర ఎన్నికల సంఘం కలగజేస్తుందని, ఈ అవకాశాన్ని అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ గోవర్ధన్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు పోలింగ్ బూత్‌ల వద్ద (ప్రభుత్వ పాఠశాలలు) బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారన్నారు. ఫాం-6, ఫాం-8లు అందుబాటులో ఉంటాయని మణికొండ, నార్సింగి, బండ్లగూడ మున్సిపాలిటీల పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మాట నిలబెట్టుకున్నాం

- పటాన్‌చెరు ఇక రెవెన్యూ డివిజన్
- ప్రజల తరఫున సీఎంకు కృతజ్ఞతలు
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: పటాన్‌చెరు కేంద్రంగా రెవెన్యూ డివిజన్, పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీవోలు జారీ చేసిందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గానికి రెవెన్యూ డివిజన్ సేవలు అవసరమని, ఇటీవల ఇక్కడ జరిగిన బహిరంగ సభలో కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లానన్నారు. పాలిటెక్నిక్ కళాశాల లేని మూలంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించడం లేదని విన్నవించినట్లు చెప్పారు. సానుకూలంగా స్పందించిన సీఎం ప్రజా సమక్షంలో హామీలు ఇచ్చారన్నారు. ఇప్పుడు రామచంద్రాపురం, అమీన్‌పూర్, గుమ్మడిదల, జిన్నారం మండలాలతో కూడిన పటాన్‌చెరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కాబోతోందన్నారు. పాలిటెక్నిక్ కళాశాలకు త్వరలో స్థలం కేటాయించి భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. వచ్చేనెల రెండో వారంలో రెవెన్యూ డివిజన్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రారంభించనున్నట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. మియాపూర్ నుంచి ఇస్నాపూర్ వరకు మెట్రో పనులకు సంబంధించి ప్రాథమిక ప్రక్రియ తుది దశకు చేరుకుందన్నారు. ఉస్మాన్‌నగర్ లో ఐటీ టవర్ ఏర్పాటుకు సంబంధిత శాఖ సన్నాహాలు ప్రారంభించిందని తెలిపారు. గుమ్మడిదలలో మినీ స్టేడియం, జూనియర్ కాలేజీ, వ్యవసాయ గోదాం ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. సమావేశంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ అన్ని స్థాయిల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.